ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 14 జూన్ 2025



తల్లికి వందనం... పేదింట నందనం

- తల్లుల ఖాతాల్లో జమవుతున్న డబ్బులు
- ఒక్కో ఇంట్లో నలుగురు, ఐదుగురికి వర్తింపు
- 2,94,559 మంది విద్యార్థులు.. 1,84,695 మంది తల్లులకు లబ్ధి
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు పలువురి కృతజ్ఞతలు

అనంతపురం విద్య, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం ద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవడంతో పేదింటి తల్లుల్లో ఆనందం వెల్లు బుకుతోంది. ఎంతమంది చదువుతున్న పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి 13వేలు చెప్పున రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేసింది. దీంతో సెల్‌ఫోన్లకు వచ్చిన మెసేజ్‌లు చూసుకుంటూ ఇంటిల్లిపాది సంబరపడ్డారు. జిల్లాలో తల్లికి వందనం పథకానికి 2,94,559 మంది విద్యార్థులను అర్హులుగా తేల్చారు. ఈమేరకు రెండో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ సెకెండియర్ చదివే విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ పిల్లలకు సంబంధించి 1,84,695 మంది పిల్లల తల్లులను లబ్ధిదారులుగా గుర్తించారు. 2,94,559 మంది విద్యార్థులకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. 13 వేలు చొప్పున ప్రభుత్వం డబ్బులు జమ చేస్తోంది. గురువారం రాత్రి నుంచే డబ్బులు పడటం మొదలైంది.



ఆధార్ ఎర్రర్ ఇతర సమస్యలను పరిష్కరిస్తున్న ఎంఈఓ వెంకటస్వామి, సిబ్బంది

8954 మంది వివరాల అప్‌డేట్‌కు ప్రక్రియ మొదలు

పాఠశాల విద్యాశాఖ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,954 మంది విద్యార్థుల వివరాల్లో ఎర్రర్స్ గుర్తించారు. ముఖ్యంగా విద్యార్థుల చైల్డ్ ఇన్ఫోలో 8,954 మంది విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్ వివరాలు అప్‌డేట్ కాలేదు. దీంతో జిల్లాలో ఆయా విద్యార్థుల తల్లి, తండ్రి ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర అధికారుల నుంచీ మండల విద్యాశాఖాధికారులకు సీఎస్ఈ (పాఠశాల విద్యాశాఖ కమిషనర్) నుంచి లింక్స్ పంపారు. దీంతో ఎంఈఓలు, తమ సిబ్బందితో ఆ లింక్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్ వివరాలను సేకరించి, అప్‌డేట్ చేసే ప్రక్రియ వేగవంతం చేశారు. అప్‌డేట్ చేసిన తర్వాత ప్రభుత్వం వీళ్లలో అర్హులు, అనర్హులను ఎవరన్నది గుర్తిస్తుంది. అర్హులైన తల్లుల ఖాతాలకు డబ్బులు జమ చేయనున్నారు. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో అడ్మిషన్లు పూర్తయిన తర్వాత వాళ్ల వివరాలు సేకరించి వాళ్లకు పథకాన్ని వర్తింపజేస్తారు. దీంతో లబ్ధిదారుల సంఖ్య కూడా పెరగనుంది.

అర్హులందరికీ తల్లికి వందనం



అర్హులందరికీ తల్లికి వందనం డబ్బులు జమ అవుతాయి. జిల్లాలో సుమారు 9వేల మంది విద్యార్థులకు సంబంధించిన తల్లిదండ్రుల ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయాలంటూ ఎంఈఓలను లింక్ పంపారు. టెలీ కాన్ఫరెన్స్‌లు కూడా పెట్టి ఎంఈఓలను ఆదేశించాం. ఈ ప్రక్రియ శరవేగంగా నడుస్తోంది. జిల్లాలో అర్హులైన ప్రతి విద్యార్థికి ఈ లబ్ధి చేకూరుతుంది. - ప్రసాద్‌బాబు, డీఈఓ

సూపర్ సిక్స్ కుటుంబం



ఆరుగురు పిల్లలతో తల్లిదండ్రులు

బెళుగుప్ప, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకంపల్లిలో ఓ నిరుపేద కుటుంబానికి తల్లికి వందనం పథకం ఎంతో ఊరట నిచ్చింది. కూలికెళ్లి కుటుంబాన్ని పోషించుకునే గంగమ్మ, ఓబుళేసు దంపతులకు ఆరుగురు సంతానం. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌కి వెళ్లే విద్యార్థిని మినహా మిగతా అందరి పేరు పథకం జాబితాలో రావడంతో ఆ కుటుంబంలో ఆనందం వ్యక్తం అవుతోంది. ఈ దంపతులకు ఎస్ఏ రాణి ఇంటర్ సెకెండియర్, రుతు ఇంటర్ ఫస్ట్ ఇయర్, శ్రావణి సంధ్య 8, దివ్య 6, జీవిత 4, ధరణి మూడో తరగతి చదివే పిల్లలు ఉన్నారు. రుతు మినహా అందరికీ ఈ పథకం వర్తించింది. దీంతో ప్రభుత్వానికి రుణపడి ఉంటామని గంగమ్మ పేర్కొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్:



ముగ్గురు పిల్లలతో ఆనందం పంచుకుంటున్న తల్లి హిమబిందు

నాది చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లి గ్రామం. మాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మాది వ్యవసాయం కుటుంబం. మా పిల్లలు ధర్మవరంలోని కాకతీయ పాఠశాలలో చదువుతున్నారు. పెద్దకుమార్తె భవజ్ఞ 5, రెండో కుమార్తె సాత్విక రెడ్డి 4, కుమారుడు జయ వెంకటరెడ్డి రెండో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా నాఖాతాలోకి రూ.39వేలు జమైంది. ఎంతో సంతోషంగా ఉంది. థ్యాంక్యూ సీఎం సార్, థ్యాంకూ లోకేశ్‌సార్ థ్యాంక్యూ ఎమ్మెల్యే పరిటాల సునీత మేడం అంటూ తల్లితో కలిసి ముగ్గురు పిల్లలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

- హిమబిందు, పులేటిపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు, నలుగురు విద్యార్థులు



మాళాపురంలో ఐదుగురు విద్యార్థులకు తల్లికి వందనం జమ అయిన కుటుంబం

విడపనకల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురం గ్రామానికి చెందిన చేళ్లగురికి రత్నమ్మ, రామాంజనేయులుకు ఆరుగురు సంతానం. ఆరుగురిని పాఠశాలలకు పంపుతున్నారు. వీరిలో సుస్మిత 9, తరగతి, అక్షిత 9, దివ్యా 6, సాయి 3, మణికంఠ మూడో తరగతి చదువుతున్నారు. ఈ ఐదుగురికి ఒక్కసారిగా రూ.65వేలు వారి తల్లి ఖాతాలో జమ అయ్యింది. దీంతో ఆ కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది. ఏడో తరగతి చదివే కుమార్తె వివరాలు తప్పుగా ఉండటంతో రాలేదన్నారు. వీ కొత్తకోట గ్రామానికి చెందిన స్వాతి, కృష్ణచైతన్య దంపతులకు నలుగురు కూతుర్లు. వీరిలో ముగ్గురికి తల్లికి వందనం జమ అయ్యింది. మాళాపురం గ్రామంలో రాధ సురేష్ దంపతులకు ముగురు సంతానం ఉన్నారు. వీరిలో ముగ్గురికి తల్లికి వదనం రూ.39వేలు జమ అయ్యాయి దీంతో ఈ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

రూ.65 వేలు వచ్చింది: రత్నమ్మ మాళాపురం

నాకు ఆరుగురు పిల్లలు ఉన్నారు. వారందరినీ బడికి పంపుతున్నా. ఒకే సారి ఐదుగురికి రూ. 13 వేలు ప్రకారం రూ. 65 వేలు జమ అయ్యింది. ఇంకో కుమార్తెకు త్వరలోనే వస్తాయని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఒక్కసారి ఇంత మొత్తం రావటం చాలా ఆనందంగా ఉంది. మా పిల్లల చదువులు మాకి భారం కాకుండా ప్రభుత్వం ఆదుకుంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.



వి. కొత్తకోట గ్రామంలో తల్లికి వందనం జమ అయిన కుటుంబం

ఇంటింటా ముగ్గురికి..



తన బిడ్డలతో డి.రాజేశ్వరి

అనంతపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన డి.సూర్యనారాయణ, రాజేశ్వరి దంపతులు గ్రామంలో కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నవ్యశ్రీ (9వతరగతి), పావని(7వతరగతి), జ్ఞానదీప్ (4వతగతి) అనే పిల్లలు ఉన్నారు. ముగ్గురికి తల్లికి వందన పథకం కింద రూ.39వేలు వారి తల్లి రాజేశ్వరి ఖాతాలోకి శుక్రవారం జమా అయ్యాయి. మరో కుటుంబానికి ఇదేవిధంగా ముగ్గురు పిల్లలుంటే వారికి రూ.39వేలు పిల్లల తల్లి ఎం.రాజేశ్వరి ఖాతాలో నగదు జమ అయ్యింది. ఈమెకు దివ్యశ్రీ(9వతరగతి), రిషికర్ణ(8వతరగతి), రిత్విక్(5వతరగతి)అనే పిల్లలు ఉన్నారు. బ్యాంకు ఖాతాలో నగదు జమ కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆ రెండు కుటుంబాల వారు కృతజ్ఞతలు తెలిపారు.



కూతుళ్లు, కుమారుడితో ఎం.రాజేశ్వరి



ఇద్దరు కుమార్తెలు, కుమారుడితో కపాడం శ్యామల

కష్టకాలంలో ఉపయోగం

మాది రాప్తాడు మండలం గంగలకుంట గ్రామం. నాకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె వర్షిణి 9, రెండో కుమార్తె ఏడో తరగతి రాప్తాడు ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. కుమారుడు మోహన్ గంగలకుంట ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం శుక్రవారం తల్లికి వందనం నిధులు విడుదల చేయడంతో నా బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమ అయ్యాయి. కష్టకాలంలో ఈ డబ్బు నా పిల్లల చదువుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- కపాడం శ్యామల, గంగలకుంట, రాప్తాడు మండలం

చంద్రబాబుకు కృతజ్ఞతలు

డి.హీరేహాళ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లికేతి గ్రామా నికి చెందిన కురుబ వరలక్ష్మి, హనుమంతుకు నలుగురు సంతానం. వీరి పిల్లలు దీపిక 9, మమత 7, కవిత 4, నరేష్ మూడో తరగతి చదువుతున్నారు. నలుగురు పిల్లలకు సంబంధించి తల్లికి వందనం పథకం కింద శుక్రవారం కురుబ వరలక్ష్మి ఖాతాలో రూ.52 వేలు జమ అయ్యింది. దీంతో ఆ కుటుంబంలో సంబరాలు మిన్నంటాయి. ఇంత పెద్ద మొత్తాన్ని తమ కుటుంబానికి అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పిల్లలతో కురుబ వరలక్ష్మి

ఒక్క రేణువును కూడా పోనియ్యం

ఇసుక తరలింపును అడ్డుకున్న నిదనవాడ గ్రామస్థులు

గ్రామంలో బోరుబావులు ఎండిపోతాయని ఆందోళన



ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్న నిదనవాడ గ్రామస్థులు

శింగనమల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తమ గొంతులో ప్రాణం ఉన్నంతవరకు ఇక్కడ నుంచి ఇసుక రేణువును సైతం తరలించలేరని మండలంలోని నిదనవాడ గ్రామస్థులు అన్నారు. కొందరు అక్రమంగా ఇసుకను తరలించడానికి వాహనాలను తీసుకుని శుక్రవారం గ్రామ సమీపంలోని పెన్నానదికి వెళ్లగా గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థులు, రైతులు మూకుమ్మడిగా ఎక్స్‌కవేటర్, టిప్పర్లను అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలోని పెన్నానది పక్కన నిదనవాడ గ్రామం ఉంది. గ్రామంలో వ్యవసాయ బోర్లు ఈ నది వల్లే రీచార్జ్ అవుతాయి. అయితే ఈ పెన్నా నది ఇసుకకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇక్కడి ఇసుక రీచ్‌కు అను మతి ఇస్తాయి. అయితే ఇసుక తరలిస్తే నదిలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. దీంతో సమీప ప్రాంతాల్లో బోరుబావులు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో వారం కిందట కొందరు పట్టా భూమిలో ఇసుక తరలింపునకు అనుమతి తీసుకున్నారు. దీంతో శుక్రవారం ఉదయం పెన్నానది దగ్గర ఇసుక తరలింపునకు ఎక్స్‌కవేటర్ టిప్పర్లతో వెళ్లారు. గ్రామస్థులు అక్కడికి చేరుకుని ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ఇసుక తరలించే వ్యక్తులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులు మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి పెన్నానది నుంచి ఒక ఇసుక రేణువును తీసుకుని వెళ్లానియ్యడం లేదన్నారు. ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తే మాగ్రామంలో వ్యవసాయ బోరుబావులు ఎండిపోతాయి. పంటలు నాశనమై మా బతుకులు దుర్భరంగా మారుతాయి. అందుకే ఇక్కడి నుంచి ఎవరినీ ఇసుక తరలించనీయకూడదని గ్రామంలో తీర్మానం చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రి భద్రతపై ప్రత్యేక దృష్టి

అధికారుల కమిటీ పరిశీలన

అనంతపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఈక్రమంలో ప్రత్యేక కమిటీని ఆస్పత్రి పరిశీలనకు నియమించింది. దీంతో శుక్రవారం ఇంటిలిజెన్స్ డీఎస్పీ సాయినాథ్, స్పెషల్‌కమాండ్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, ఫైర్‌శాఖడిప్యూటీ ఆఫీసర్ లింగమయ్య, ఏపీఎంఐడీసీ ఈఈ శ్రీనివాసనాయుడు,ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టరు రామకృష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టరు పద్మజ, ఏఓ రవీంద్ర తదితరులు ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలోని ప్రతివార్డు, ప్రతివిభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కడెక్కడ సీసీకెమెరాలు పెట్టాలి, కాంపౌండు ఎత్తు పెంచడం, సెక్యూరిటీ గార్డులను పెంచడం, విద్యుత్ లైట్లు ఎక్కడెక్కడ ఇంకా ఏర్పాటు చేయాలి తదిర ప్రతిపాదనలు తీసుకున్నారు. నివేదికలు ప్రభుత్వానికి పంపుతారని ఆస్పత్రి ఏఓ రవీంద్ర తెలిపారు.



జిల్లా ఆస్పత్రిలో భద్రతపై అధ్యయనం చేస్తున్న అధికారులు

బడికి తాళం

రామగిరి పాఠశాల డౌన్‌గ్రేడ్

ఆగ్రహంతో తల్లిదండ్రుల వాగ్వాదం

పాఠశాలకు తాళం వేసి నిరసన

పామిడి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం తాళం వేసి నిరసన తెలిపారు. స్థానికుల వివరాలు మేరకు... ఇప్పటి వరకూ ప్రాథమికోన్నత పాఠశాలగా ఉన్న పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా డౌన్ గ్రేడ్ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 6, 7, 8వ తరగతి విద్యార్థులను ఎద్దులపల్లి హైస్కూల్‌కు మ్యాపింగ్ చేశారని ఉపాధ్యాయులు తెలియజేశారు. దీంతో ఆ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. రామగిరిలో ప్రాథమికోన్నత పాఠశాలకు కావాల్సిన వసతులు లేకపోవడం, తగినంత మంది విద్యార్థులు లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలగా డౌన్‌గ్రేడ్ చేశారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



రామగిరిలో పాఠశాలకు తాళం వేయడంతో ఆవరణలోనే ఉపాధ్యాయులు, విద్యార్థులు

దీంత ఓఓ ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల తరగతి గదులకు తాళాలు వేసి ఆందోళన చేపట్టారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే

- జయానాయక్, ఎంఈఓ-1, పామిడి

రామగిరిలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు కోసమే హైస్కూల్‌కు మ్యాపింగ్ చేశాం. రామగిరిలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల నియామకం, తరగతి గదుల కొరత తీవ్రంగా ఉంది. అవసరమైనంత స్ట్రెంత్ కూడా లేదు. దీంతో పక్కనే ఉన్న ఎద్దులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు మ్యాపింగ్ చేశాం. ఆయా విద్యార్థుల రాకపోకలకు రూ.ఆరువేలు అందజేస్తాం. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకే డౌన్ గ్రేడ్ చేశాం.

ఎమ్మెల్యే అమిలినేనికి గవర్నర్ అవార్డు



కళ్యాణదుర్గం , జూన్ 13(ఆంధ్ర జ్యోతి): గవర్నర్ అవార్డుకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఎంపికైనట్లు ఆయన క్యాంపు కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు. 2024-25కు సంబంధించి ఒక్క రోజులోనే ఎక్కువ యూనిట్లు రక్తదానం చేయించడంతో ఈ అవార్డుకు ఎమ్మెల్యేను ఎంపిక చేసినట్లు తెలిపారు. అవార్డును ఈ నెల 14న గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఎమ్మెల్యే అందుకోనున్నారు.

అదృష్టం ఎవరికో..?

- వజ్రాల కోసం అన్వేషణ
- గురువారం దొరికిన వజ్రం ?
- సందడిగా మారిన వజ్రకరూరు పరిసరాలు



వజ్రాలను వెతుకుతున్న జనం

6

సమాధాన్యం చెప్పేదెవరు..?

మూడు నెలలకోసారి జాబ్ మేళా

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్
- అనంతలో మెగా జాబ్ మేళాకు విశేష స్పందన
- 3500 మంది నిరుద్యోగుల హాజరు
- 1450 మందికి ఉద్యోగ అవకాశాలు

అనంతపురం అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ప్రతి మూడు నెలలకోసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెల్యే దగ్గుపాటి నేతృత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా నిర్వహించిన ఈ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాలో 60 కంపెనీలకు ఐదువేల మంది నిరుద్యోగ యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 3500 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 1450 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ... పట్టుదల, తపన ఉంటే ఏదైనా సాధించవచ్చునన్నారు. 1998లో తాను రూ.2500 వేతనంతో ఉద్యోగంలో చేరానని, ఇప్పుడు 1500 మంది ఉద్యోగులు తన సంస్థలో పని చేస్తున్నారన్నారు. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను పట్టుదలతో ఈ స్థాయికి చేరానన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లు రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ఏడాది కాలంలోనే రూ.ఏడు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కరువు జిల్లా అనంతకు ఆటోమొబైల్, సోలార్ తదితర పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జీడీఎం సూర్యనారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, డీఆర్‌డీఏ పీడీ శైలజ, కమిషనర్ బాలస్వామి, కంపెనీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

మళ్లీ సేంద్రియం వైపు...

సేంద్రియ సేద్యం వైపు రైతుల చూపు

దిగుబడులు పెరిగాయంటున్న కర్షకులు

(6లో..)

కమిటీ ఉండీ వృథా..!

వేసవి క్రీడా శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం

- శాప్ నిధులిచ్చినా.. ఖర్చు చేయని దుస్థితి
- సామగ్రి ఇవ్వకుండానే క్యాంపుల ముగింపు
- తక్కువ మందితో మమ అనిపించిన వైనం



డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో సమ్మర్ కోచింగ్‌లో క్రీడాకారులు (ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు నియమించిన జిల్లాస్థాయి కమిటీ పట్టనట్లు వ్యవహరించింది. ఎక్కువ మందికి శిక్షణ అందించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. కనీసం వచ్చిన నిధులతో క్రీడాసామగ్రి కొనుగోలు చేసి, క్రీడాకారులకు ఇవ్వకుండా కాలయాపన చేసింది. క్రీడా శిబిరాలే ముగిసినా.. నేటికీ పంపిణీ చేయలేదు. క్రీడాసామగ్రే లేకుండా శిబిరాలు ముగించేశారంటే నిర్వహణ ఏస్థాయిలో సాగి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చారన్న విమర్శలు మూటగట్టుకున్నారు.

మమ అనిపించారు..

ఏటా వేసవిలో క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. గత వైసీపీ ప్రభుత్వం వాటిని అటకెక్కించింది. వేసవి శిబిరాల ఊసేలేకుండా చేసింది. కొత్త ప్రభుత్వం మళ్లీ వేసవి శిబిరాలు న్వహించాలని నిర్వహించింది. ఐదేళ్ల తరువాత ఈ ఏడాది వేసవిలో శిబిరాలు ఏర్పాటు చేశారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ)కి ఆదేశాలు అందాయి. నిర్వహణకు జిల్లాలో జాయింట్ కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) కన్వీనర్‌గా, సభ్యులుగా పరిశ్రమల కేంద్రం జీఎం, డీఈఓను చేర్చారు. క్యాంపుల విషయాన్ని క్రీడాకారులకు తెలియజేయడంలోనే కమిటీ విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఒక్కో శిబిరంలో 50మంది క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో 15-25 మందితో సరిపెట్టేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వంద సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని శాప్ లక్ష్యంగా నిర్దేశించింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో వంద శిబిరాలకుగాను 2,600 మంది హాజరైనట్లు డీఎస్ఏ అధికారుల రికార్డులు చెబుతున్నాయి.

శాప్ నిధులిచ్చినా..

ఉమ్మడి జిల్లాలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు శాప్ నిధులు మంజూరు చేసింది. ఒక్కో శిబిరానికి రూ.7 వేలు చొప్పున కేటాయించింది. ఇందులో రూ.5వేలు క్రీడాసామగ్రి, రూ.1,500 కోచ్‌కి గౌరవ వేతనం, రూ.500 బ్యానర్ ఇతర ఖర్చులకు వెచ్చించాలని ఆదేశించింది. నిధులు మంజూరు చేసి 25 రోజులైంది. సమ్మర్ కోచింగ్ క్యాంపులు కూడా ముగిశాయి. విచిత్ర మేమిటంటే నేటికీ క్యాంపునకు హాజరైన వారికి క్రీడాసామగ్రి అందజేయలేదు. 25రోజులు సమయం ఉన్నా కమిటీ నిర్లక్ష్యం కారణంగానే క్రీడాసామగ్రి అందజేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శాప్ మంజూరు చేసిన నిధులను పక్కదారి పట్టించే యోచనలో ఉన్నారనే ఆరోపణలు లేకపోలేదు.

ఆలస్యమైన మాట వాస్తవమే



నాణ్యమైన క్రీడాసామగ్రి తక్కువ ధరకే కొనుగోలు చేయాలని చేసిన ప్రయత్నంతో కొద్దిగా ఆలస్యమైంది. క్రీడాసామగ్రి కొనుగోలు చేసిన వెంటనే ఆయా శిబిరాల్లో సాధన చేస్తున్న వారికి అందిస్తాం. సమ్మర్ కోచింగ్ క్యాంపులు సజావుగా నిర్వహించాం.

- ఉదయ్‌భాస్కర్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ)

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

కొత్తచెరువు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) టెన్త్, ఇంటర్ పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిందని డీఈఓ కిష్టప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను డబ్యుడబ్యుడబ్యు.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ. జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. సత్యసాయి జిల్లాలో ఓపెన్ టెన్త్ పరీక్షలు 372 మంది రాయగా.. 243 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 65.32 శాతం ఉత్తీర్ణత నమోదయిందని వివరించారు. ఓపెన్ ఇంటర్ పరీక్షలు 774 మంది రాయగా.. 572 మంది ఉత్తీర్ణత సాధించడంతో 73.90 శాతం నమోదయిందని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ జవాబు పత్రాల రీ కౌంటింగ్‌కు ఒక సబ్జెక్టుకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీ వెరిఫికేషన్ (జవాబు పత్రం జిరాక్స్)కు ఒక సబ్జెక్టుకు రూ.1000 ఫీజు ఈనెల 25 తేదీలోగా చెల్లించాల్సి ఉంటుందని డీఈఓ తెలిపారు.

మళ్లీ సేంద్రియం వైపు...

సేంద్రియ సేద్యం వైపు రైతుల చూపు

దిగుబడులు పెరిగాయంటున్న కర్షకులు

కళ్యాణదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట మరచి పోయిన సేంద్రియ సాగు వైపు అన్నదాతలు ప్రస్తుతం మొగ్గు చూపుతున్నారు. రసాయన ఎరువుల వాడకంతో తడిసిమోపెడవుతున్న పెట్టుబడుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా ప్రోత్సహిస్తుండటంతో రైతులు సేంద్రియ సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. దీంతో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా సేంద్రియ ఎరువులను ఉపయోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

భూసారం పెంపొందించుకునే దిశగా చర్యలు

రసాయనిక ఎరువులు ద్వారా కలుగుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. దీంతో భూసారాన్ని పెంపొందించుకునే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. గొర్రెలు, మేకలు, పశువుల పేడను పొలాలకు తోలుతున్నారు. పశువులు లేని రైతులు ఇతర ప్రాంతాల్లో ఎరువులు కొని పొలాలకు తరలిస్తున్నారు. రసాయనిక ఎరువుల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో ఆ ఎరువులు వాడే రైతులకు పెట్టుబడి పెరుగుతోంది. పైగా దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే రైతులు సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు.

రెండు వేల హెక్టార్లకు పైబడి సాగు

ఖరీఫ్ కింద ప్రతి ఏటా నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రెండు వేల హెక్టార్లకు పైబడి వేరుశనగ పంటను సాగు చేస్తున్నారు. ఇందులో అంతర పంటలు కూడా సాగు చేస్తారు. ఇప్పుడు ఏ పంట సాగు చేయాలన్న మొదట సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. దీంతోపాటు కర్బూజా, కలింగర, టమోటా, గెనసగడ్డ, బొప్పాయి, మిర్చి, బీర పంటలకు కూడా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వలన వ్యవసాయ ఖర్చులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు.



పొలంలో కుప్పలుగా కనిపిస్తున్న సేంద్రియ ఎరువు

తక్కువ ఖర్చు



సేంద్రియ ఎరువుల వాడకంతో పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉంటోంది. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూమి గట్టి పడి పంటలకు రోగాలు ఎక్కువ వచ్చేవి. పశువుల పేడ వాడకంతో భూమి గుళ్ల బారి ఎక్కువ కాలం భూమిలో సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తక్కువే. అధిక పంట వస్తోంది. అందుకే ప్రతి ఏటా పశువుల ఎరువునే వాడుతా. పంటల దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంది.

- రామాంజనేయులు, రైతు, కరిగానిపల్లి

అనేక లాభాలు

సేంద్రియ ఎరువు వాడకం ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయి. పశువుల పేడ చెత్తతో కూడిన సేంద్రియ ఎరువు వాడకం వల్ల పంట పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ ఉంటుంది. తేమ ఉండటం వలన చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్లు కూడా తక్కువే. రైతుకు తక్కువ ఖర్చు అధిక ఫలసాయం లభిస్తుంది.

- ఎల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం డివిజన్

మంచి దిగుబడి



కర్బూజ, కళింగర పంటల సాగుకు సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. పంటలకు ఎటువంటి తెగుళ్లు రాకుండా సేంద్రియ ఎరువులు బాగా ఉపయోగపడతాయి. పేడ ఎరువుకు మంచి డిమాండ్ ఉంది. పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో సేంద్రియ ఎరువులకు ఆయా ప్రాంతాల్లో మంచి రేటు పలుకుతోంది.

- హరీష్, రైతు, కరిగానిపల్లి

సమాధాన్యం చెప్పేదెవరు..?

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

నెల దాటినా రైతుల ఖాతాల్లో జమకాని సొమ్ము

రూ.2.96 కోట్లు బకాయి

బొమ్మనహాళ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి.. 45 రోజులైనా నేటికీ డబ్బు జమకాలేదు. అధికారుల చుట్టూ తిరగడం అన్నదాతల వంతైంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలనీ, మద్దతు ధర కల్పిస్తామనీ, వెంటనే డబ్బు ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెప్పారు. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. ఖరీఫ్‌లో విక్రయించిన ధాన్యం డబ్బులు 24 గంటల్లో జమ చేశారు. రబీలో కొనుగోలు చేసి 45 రోజులైనా డబ్బు రైతులు ఖాతాలో జమ కాలేదు. కుటుంబ అవసరాలు, ఖరీఫ్ సాగు పెట్టుబడులకు డబ్బుల్లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం డబ్బు ఖాతాలో వేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు అకౌంట్లో జమైందా, లేదా అని తెలుసుకునేందుకు తరచూ ఫోన్ మెసేజ్‌లు, ఏటీఎంలో చెక్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం బయట మార్కెట్ ధర పెరగడంతో వ్యాపారులకే విక్రయించినా డబ్బు ఇచ్చేవారని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించి, ఎదురు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు ముందుస్తుగా కురుస్తుండడంతో ఖరీఫ్ పెట్టుబడులకు రబీ ధాన్యం డబ్బులు అవసరం అని అన్నదాతలు అంటున్నారు. 45 రోజులు దాటినా ధాన్యం డబ్బులు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు.

1,268 మెట్రిక్ టన్నుల కొనుగోలు

మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట సొసైటీ కేంద్రాల్లో 120 మంది రైతుల నుంచి రూ.2.96 కోట్ల విలువైన 1,268 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 45 రోజులు దాటినా చెల్లింపుల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.



ధాన్యం బస్తాల లారీ (ఫైల్)

నెల రోజులైనా డబ్బు రాలేదు



ఉద్దేహాళ్‌లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో 500 క్వింటాళ్ల ధాన్యం విక్రయించి, నెల రోజులు దాటింది. 48 గంటల్లో నగదు ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు డబ్బులు అకౌంట్లో పడలేదు. ఖాతాలో ఎప్పుడు పడతాయా అని ఫోన్‌లో మెసేజ్‌లు చూస్తున్నా. ఏటీఎంలో బ్యాలెన్స్ చెక్ చేసుకుంటున్నా. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నా. వారు సరైన సమాధానం చెప్పడం లేదు. **- సువర్ణకుమారి, రైతు, గొడసలపల్లి**

వడ్డీలు పెరిగిపోతున్నాయి



పంట పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పులు తీసుకున్నా. వారి నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. ధాన్యం విక్రయించినా.. డబ్బు పడలేదు. అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు. ఏం చేయాలో అర్థం కావట్లేదు.

- రామాంజనేయులు, రైతు, ఉద్దేహాళ్

రైల్వే డబ్లింగ్ పనుల ఆమోదంపై కాలవ హర్షం

రాయదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బళ్లారి - చిక్కజాజూరు మధ్య రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రూ. 3,340 కోట్ల పనులకు ఆమోదముద్ర వేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్, సహాయమంత్రి సోమన్నకు కృతజ్ఞతలు తెలిపారు. బళ్లారి నుంచి ఓబుళాపురం, సోమలాపురం, రాయదుర్గం, మొలకాల్మూరు, చెళ్లకెరె, బాలేనహళ్లి మీదుగా చిక్కజాజూరు వరకు దాదాపు 185 కి.మీ.కు పైగా విస్తరణ ఉంటుందన్నారు. డబ్లింగ్ పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగై రాయదుర్గం టెక్స్‌టైల్స్ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు.

ఐటీఐ విద్యార్థులకు జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఐటీఐ పాస్ అయిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపురెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 17న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలకు బయోడేటా, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పదో తరగతి, ఐటీఐ మార్కుల మెమోలతో హాజరుకావాలని సూచించారు.

బెల్లంపల్లి స్టేషన్‌లో రైళ్ల స్టాపింగ్ రద్దు

గుంతకల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే పలు రైళ్లకు తెలంగాణలోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ రద్దుచేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లోని బాలార్షా-ఖాజీపేట్ సెక్షన్‌లోని బెల్లంపల్లి యార్డులో జరగనున్న ప్రీ నాన్ ఇంటర్లాకింగ్, నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా వివిధ తేదీల్లో పలు రైళ్లకు ఆ స్టేషన్‌లో స్టాపింగ్‌ను తొలగించినట్లు తెలియజేశారు. హుబ్లీ-బనారస్ (నం. 07323) రైలును ఈ నెల 14, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం .07324)ను ఈనెల 17, 24 తేదీల్లో, గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 12591) రైలును 21వ తేదీన, జైపూర్-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (నం. 12976) రైలును 23, 25 తేదీల్లోనూ బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో నిలపడం లేదని మిగతా తేదీల్లో యధాతథంగా స్టాపింగ్ కొనసాగుతుందని తెలిపారు.

అదృష్టం ఎవరికో..?

- వజ్రాల కోసం అన్వేషణ
- గురువారం దొరికిన వజ్రం ?
- సందడిగా మారిన వజ్రకరూరు పరిసరాలు

ఉరవకొండ/గుంతకల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తొలికరి చినుకులు తాకిన నేల పరిమళాలు వెదజల్లుతూ ఆహ్లాదాన్ని పంచుతుంది. కానీ వజ్రకరూరు ప్రాంతం మాత్రం సువాసనలతో పాటు తన పొత్తిళ్లలో దాగిన మేలిమి వజ్రాలను అందిస్తోంది. ప్రతి ఏటా తొలకరి మొదలైతే చాలు ఈ ప్రాంతం వజ్రాల అన్వేషకులతో సందడిగా మారుతుంది. ఈ నేపథ్యంలో గురువారం ఓ వ్యక్తికి దాదాపు సుమారు 30 గ్రాముల బరువుండే వజ్రం దొరికిందంటూ సమాచారం దావానలంలా వ్యాపించింది. ఇంకేముంది శుక్రవారం ఉదయానికల్లా ఆటోలు, బైక్‌లపై చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల వారేకాదు దూర ప్రాంతాల నుంచి సైతం అన్వేషకులు వాలిపోయారు. స్థానిక ప్రజలతో పాటు బద్వేలు, గార్లదిన్నె, ఉరవకొండ, అనంతపురం, ప్రకాశం జిల్లా దొనకొండ, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రజలు తెల్లవారుజామునే టిఫిన్, భోజన కారియర్‌లతో వజ్రకరూరుకు చేరుకుంటున్నారు. వజ్రకరూరు శివారులోని పొలాల్లో మహిళలు, పురుషులు, వృద్ధులు, చిన్న పిల్లలు సైతం మెరుపు రాళ్ల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్వేషణ సాగిస్తున్నారు. వజ్రకరూరులో వర్షాలు కురిసిన సమయంలో వజ్రాలు లభ్యం కావడం సర్వసాధారణం. అనేక మందికి గతంలో విలువైన వజ్రాలు లభించి ఉండటంతో ఒక్క వజ్రం లభిస్తే చాలు మన జీవితాలు మారిపోతాయన్న ఆశతో చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రజలు ఆటోలు, కార్లలో వచ్చి వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. కొద్దిగా మెరుస్తూ వజ్రంలాగా కనిపించిన ప్రతి రాయిని సేకరిస్తున్నారు. కొందరు రోజుల తరబడి స్థానికంగా ఉంటూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక్కడ రూ.లక్ష మొదలుకొని రూ20లక్షల విలువ చేసే వజ్రాలు లభిస్తున్నట్లు సమాచారం.

ఆశతో వచ్చాం: ఈశ్వరమ్మ, అనంతపురం



వర్షాలు కురిసిన సమయంలో వజ్రాలు దొరుకుతాయన్న ఆశతో అనంతపురం నుంచి వచ్చాం. రెండ్రోజుల నుంచి వెతుకుతున్నా దొరకలేదు. తెల్లటి రాళ్ల వంటివి దొరికాయి. వాటిని గుర్తించడం కష్టంగా ఉండటంతో వెళ్లి పోతున్నాం.



వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు, సేకరించిన రాళ్లను చూసుకుంటున్న మహిళలు

వజ్రం దొరికింది..!

గురువారం భారీ వర్షం కురియడంతో వజ్రాల కోసం వెతికే జనం గుంపులుగుంపులుగా వజ్రకరూరుకు వచ్చారు. ఒక వ్యక్తి బొటనవేలు గోరంత వెడల్పు ఉన్న వజ్రం దొరికిందని, పక్కవారు చూడటంతో అతడు తన పేరు, ఊరు ఎవరికీ తెలపకుండా వెళ్లిపోయాడంటూ శుక్రవారం అక్కడున్న అన్వేషకులు తెలిపారు. వజ్రం దొరికిన వ్యక్తి గురువారమే కర్నూలు జిల్లా పెరవలిలో అమ్మాడని, వజ్రాల వ్యాపారి ఎక్కడ దొరికిందని అడగ్గా వజ్రకరూరులోని పొలం పేరు తెలపడంతో ఆ వ్యాపారి తన పరిధిలో ఉన్న అన్వేషకులకు సమాచారమిచ్చి పంపినట్లు తెలిసింది. కర్నూలు జిల్లా నుంచే కాదు తిరుపతికి చెందిన వారు సైతం వజ్రకరూరుకు చేరుకుని పొలాల్లో వెతుకులాడటం కనిపించింది. గుంతకల్లు చెందిన సుంకన్న, తిరుపతికి చెందిన వెంకటేశులుతోపాటు మరికొందరు అన్వేషకులు గురువారం వజ్రం దొరికినట్లు రూఢీగా తెలిపారు.



వజ్రాలు వెతికేందుకు వచ్చిన వారి వాహనాలు

అనంతపురం నుంచి వచ్చా



వజ్రాలు దొరుకుతాయని చెప్పడంతో అనంతపురం నుంచి రెండ్రోజుల కిందట ఇక్కడకు వచ్చాం. రెండ్రోజులుగా ఇక్కడే ఉన్నాం. తెల్లగా మెరిసేటి రాళ్లు మాత్రమే దొరికాయి. వజ్రం దొరకాలంటే అదృష్టం కూడా ఉండాలి. **- హనుమక్క, అనంతపురం**

తప్పిన పట్టు..!

భారీగా తగ్గిన మల్బరీ సాగు విస్తీర్ణం

నీరు, ప్రోత్సాహకాల కొరతతో కనుమరుగు



నల్లమాడ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్బరీ సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. గతంలో 18వందల ఎకరాల్లో ఉన్న సాగు ప్రస్తుతం వంద ఎకరాల్లో కూడా కనిపించడం లేదు. గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, ప్రకృతి విపత్తుల వల్ల నష్టాలు రావడంతో రైతులు మల్బరీ సాగును మానేశారు. మండలంలోని కుటాపల్లి గ్రామం లో 90శాతం మంది రైతులు పట్టు పురుగుల పెంపకం చేసేవారు. ఆ గ్రామంలోనే దాదాపు 30వేల నుంచి 40వేల మట్టి కొనుగోలు చేసేవారు. కర్ణాటక రాష్ట్రంలోని సిడ్లఘట్ట, చెదలపురం, ములబాగల్, రామ్‌నగర్, తమిళనాడులోని చెన్నపట్నం వెళ్లి మట్టిని తెచ్చుకుని పట్టుపురుగుల పెంచేవారు. అక్కడ నుంచి తెచ్చిన మట్టితో నాణ్యమైన దిగుబడులు వచ్చేవి. దీంతో సీబీ రకం వంద మట్టిని రూ. 8వేలు, బైవోల్టిన్ రకం రూ. 6వేలు వెచ్చించి తెచ్చుకునేవారు. దిగుబడి బాగా వస్తే సీబీ రకం వంద మట్టికి 90 కిలోలకు పైబడి, బైవోల్టిన్ రకం 80 కిలోలకు పైబడి పట్టుగూళ్లు ఉత్పత్తి అయ్యేవి. నాణ్యమైన గూళ్లకు మంచి ధర లభించేది. సీబీ రకానికి కిలో రూ.300 పైబడి, బైవోల్టిన్ రకానికి రూ. 600పైబడి ధర లభించేది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రకాన్ని బట్టి కిలోకు ఇంత చెప్పున ప్రోత్సాహకం అందించేది. అయితే రైతులు మంచి ధర వస్తుండటంతో కర్ణాటకలో విక్రయించేవారు. ఇలా గ్రామానికి ప్రతి నెలా రూ.50లక్షల దాకా ఆదాయం వచ్చేది.

గతించిన వైభవం

ప్రస్తుతం కుటాపల్లి గ్రామంలో మల్బరీ సాగు చేసే రైతులే కరువయ్యారు. బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడం, దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో గ్రామంలో ఐదేళ్ల నుంచి మల్బరీ పెంపకం పూర్తిగా కనుమరుగైంది. అలాగే వైసీపీ పాలనలో మల్బరీ రైతులకు ప్రోత్సాహకాలు కూడా కరువయ్యాయి. దీంతో రైతులు మల్బరీ సాగుకు స్వస్తి చెప్పారు. ప్రస్తుతం ఏ కొద్దిమంది రైతులు తప్ప ఎవరూ సాగు చేయడంలేదు. మండలంలోని పులగంపల్లి, ఎర్రచెరువుపల్లి, దొన్నికోట, చెరువువాండ్లపల్లి, వంకరకుంట, వేళ్లమద్ది గ్రామాల్లో అరకొరగా మల్బరీ సాగు చేస్తున్నారు.



రేషం పురుగులు మేపుతున్న దృశ్యం

గ్రామంలో మల్బరీ కనుమరుగు



మాగ్రామంలో గతంలో 30వేల నుంచి 40వేల మట్టిని మేపేవారు. భూగర్భజలాలు తగ్గిపోయి, నీరు అరకొరగా రావడంలో మల్బరీసాగుకు స్వస్తి చెప్పి, ఇతర పంటలు సాగుచేసుకుంటున్నాం. గ్రామంలో ప్రతి రైతు మల్బరీ సాగుచేసేవాడు. మంచి ఆదాయం వస్తుండేది. ప్రస్తుతం నీరు లేకపోవడం, ప్రభుత్వం నుంచి రాయితీలు రాకపోవడంతో గ్రామంలో మల్బరీ సాగు కనుమరుగైంది. ప్రభుత్వం రాయితీలు అందిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

- గన్‌రెడ్డి, రైతు, కుటాలపల్లి

ప్రోత్సాహకం ఇవ్వాలి



నేను రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. మంచి దిగుబడులు వస్తున్నాయి. పండించిన పట్టుగూళ్లకు కిలోకు ప్రభుత్వం రూ.50లు ఇన్సెంటివ్ ఇచ్చేది. గత ఆరేళ్ల నుంచి అది ఇవ్వడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా రైతులకు ఇన్సెంటివ్ ఇస్తే మరి కొంతమంది రైతులు మల్బరీ సాగుకు మొగ్గు చూపుతారు.

- ప్రభాకర్‌రెడ్డి, రైతు, పులగంపల్లి

నేడు దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగా వేడుకలు: కలెక్టర్



అనంతపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా జిల్లా కేంద్రంలో దివ్యాంగుల రాష్ట్రస్థాయి యోగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తన క్యాంపు కార్యాలయం నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దివ్యాంగులతో రాష్ట్రస్థాయి యోగా వేడుకలను పోలీస్ పరేడ్ గ్రౌండులో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనేలా దివ్యాంగులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ శనివారం ఉదయం 6-30గంటలకు పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకోవాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఈ వేడుకలకు ఆహ్వానించాలని సూచించారు. మైదానంలో ఎల్‌ఈడీ స్క్రీన్స్, మొబైల్ టాయ్‌లెట్స్, మైకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి హాజరవుతున్న వారికి అల్పాహారం, తాగునీటిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. మెడికల్ క్యాంపులు, 108 వాహనాలు అందుబాటులో ఉండాలని అన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ వినోద్, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవి, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైతు ఆత్మహత్య


జటింగప్ప (ఫైల్)

కళ్యాణదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపంపల్లికి చెందిన రైతు జటింగప్ప(55) అప్పుల బాధతో శుక్రవారం తన తోటలోని చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. జటింగప్ప తన రెండు ఎకరాల పొలంలో టమోటా, వేరుశనగ సాగు చేసేవాడు. పంట సరిగా పండక నష్టపోయాడు. అప్పులు రూ.10 లక్షలు పేరుకుపోయాయి. తీర్చేమార్గం లేక ఆత్మహత్య చేసుకున్నాడు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైతుకు ఇద్దరు భార్యలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సోమందేపల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ బాలికకు మాయమాటలు చెప్పి మూడు రోజుల క్రితం తీసుకువెళ్లిన యువకుడిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని సీఐ రాఘవన్ తెలిపారు. నిందుతుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు.

మయూర మురిపెం..!




కళాశాల డోమ్‌పై కూర్చున్న నెమలిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న నగర ప్రజలు

అడవిని వదిలి
అంబర వీధిన వచ్చి
ఆలయ శిఖరంపై
కూర్చున్న ఓ మయూరమా..!
ఆహారం కోసమా..
ఆనందం కోసమా లేక
అక్షరవనంలో
అ..ఆలు నేర్చుకోవడానికా
దేని కోసం వచ్చావ్..?
వన్నెలద్దిన నీ మేని రూపం
చూచిన కన్నులకు విందు
అందుకే మూడో కన్నుతో
బంధిస్తున్నాం కాస్త ఉండు..!

అనంతపురం నగరంలోని ట్రిబుల్ ఎస్ కళాశాలపై ఓ నెమలి సందడి చేసింది. ఆకాశం మబ్బులు పట్టి, చిరు జల్లులు కురుస్తుండగా ఆహ్లాదకరమైన వాతావరణానికి మురిసిపోయింది. కళాశాల శిఖరంపై చేరి చూపరులకు ఆనందం కలిగించింది. మయూరాన్ని చూసిన నగర ప్రజలు కొందరు తమ సెల్‌ఫోన్‌లలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. వాహనాలను ఆపి మరీ ఆసక్తిగా తిలకించారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, అనంతపురం

ఏమిటిది మాస్టారూ..!

- బదిలీలు.. ఉద్యోగోన్నతికి దొడ్డిదారి
- లేని రోగాలు ఉన్నట్లు ధ్రువపత్రాలు
- ప్రిఫరెన్షియల్ కేటగిరీలో అక్రమార్కులు
- మునుపెన్నడూ లేనన్ని జబ్బుల దరఖాస్తులు
- ముక్కున వేలేసుకుంటున్న సహోపాధ్యాయులు


బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, జూన్ 13(ఆంధ్రజ్యోతి): 'సమర్థులైన ఉపాధ్యాయులు ప్రపంచాన్ని తరగతి గదిలోకి తెస్తారు..' అని గురువుల గొప్పదనాన్ని వర్ణించారు పెద్దలు. ఉపాధ్యాయులు అంటేనే సమర్థులు. శిల లాంటి బాలలను శిల్పాలుగా ఆవిష్కరించే, ప్రాణ ప్రతిష్ఠ చేసే అపర బ్రహ్మలు. ఒకప్పుడు ఊరికి పెద్ద దిక్కు వారే..! ఊరి జనానికి ఏ సమస్య వచ్చినా అయ్యవారిని కలిసి పరిష్కారం అడిగేవారు. అంతటి గౌరవం గురుదేవులకు దక్కేది. అంతటి అత్యున్నత స్థానంలో ఉండే గురువుల్లో కొందరు స్వార్థం కోసం విలువలకు తిలోదకాలు ఇస్తుండటం ఇప్పటి విషాదం. చాలా చిన్న చిన్న అంశాలకే కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. అందులో ఒకటి.. బదిలీలు. కోరుకున్న చోటుకు వెళ్లేందుకు, సొంతూరికి దగ్గరగా ఉండేందుకు, సిటీలో సౌకర్యవంతమైన జీవితం అనుభవించేందుకు.. ఇలా ఏదో ఒకదానికోసం పైరవీలు చేసుకుంటున్నారు. డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు. ఇంతకు మించి.. తమకు ఆరోగ్యం బాగాలేదని నకిలీ ధ్రువపత్రాలను సమర్పిస్తున్నారు. ఇలా చేసేవారు కొంతమందే అయినా, ప్రభావం చాలామందిపై పడుతోంది. పద్ధతిగా వ్యవహరించేవారు తీవ్రంగా నష్టపోతున్నారు. నిబంధనలు పాటించేవారు తమ హక్కులను కాపాడుకునేందుకు ఉన్నతాధికారుల వద్దకు.. చివరకు కోర్టులకు కూడా వెళ్లాల్సి వస్తోంది.

అయాచిత లబ్ధి కోసం..

జబ్బులు ఉంటే గతంలో దాచిపెట్టేవారు. ఇప్పటికీ చాలామంది తమకు దీర్ఘకాలిక వ్యాధి ఏదైనా ఉంటే.. బయటకు చెప్పుకోరు. కానీ కొందరు ఉపాధ్యాయులు లేని జబ్బులు తమకు ఉన్నట్లు ధ్రువపత్రాలు తెచ్చి మరీ ఇస్తున్నారు. తాజాగా జరుగుతున్న ఎస్‌జీటీ బదిలీల్లో, ఇటీవలే పూర్తి అయిన స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంల బదిలీల్లో ఇలాంటి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. వీటిపై కొందరు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఉపాధ్యాయ బదిలీల్లో, ప్రమోషన్లలో లబ్ధికోసం కొందరు నకిలీ పీహెచ్ సర్టిఫికెట్లు సమర్పించారు. దొడ్డిదారిలో అడ్డగోలుగా పీహెచ్ పాయింట్లు పొంది, మంచి స్థానాలు పొందాలని చూస్తున్నారు. ఇప్పటికే కొందరు హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు పొందగా... ఎస్‌జీటీల్లో భారీగా లబ్ధి పొందేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,792 మంది టీచర్లు బదిలీలకు దరఖాస్తు చేశారు. ఇందులో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో 417 మంది ఉన్నారు. స్పౌజ్ పాయింట్ల కింద మరో 433 మంది దరఖాస్తు చేశారు. అడ్డగోలు పీహెచ్ సర్టిఫికెట్లతో ఇప్పటికే కొందరు లబ్ధి పొందారు. కట్టడి చేయాల్సిన విద్యాశాఖ ఉన్నతాధికారులు విఫలమయ్యారు.

భారీగా దరఖాస్తులు

ఉపాధ్యాయుల్లో దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులను ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద గుర్తించి బదిలీలు, ప్రమోషన్లలో ప్రాధాన్యం ఇస్తారు. వైకల్యం కొందరికి పుట్టుకతో, మరికొందరికి ప్రమాదాలు, వ్యాధులు తదితర సమస్యల కారణంగా మధ్యలో వస్తుంటుంది. ఈ కేటగిరీలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. మునుపెన్నడూ లేనన్ని దరఖాస్తులు రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

కొత్తగా వచ్చిన జబ్బులెన్నో..

ప్రిఫరెన్షియల్ కేటగిరీలో లబ్ధికోసం కొందరు టీచర్లు కొత్త జబ్బులను కొని తెచ్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. లేని రోగాలను ఉన్నట్లు సర్టిఫికెట్లు తెచ్చి సమర్పించారని అంటున్నారు. లేని జబ్బులు ఉన్నట్లు చూపించిన జాబితాలో 'వినికిడి లోపం' ప్రధానమైనదని కొందరు ఉపాధ్యాయులు అంటున్నారు. ఈ జబ్బు ఉన్నట్లు కొందరు బాగా ఖర్చు చేసి మరీ సర్టిఫికెట్లు పొందారని సమాచారం. డాక్టర్లు ఇచ్చిన ఉత్తుత్తి జబ్బు సర్టిఫికెట్లకు జిల్లా విద్యాశాఖాధికారులు గేట్లు తెరిచారు. ఇదే అదనుగా కొందరు ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు నకిలీ వ్యాధులకు ధ్రువపత్రాలు సమర్పించి బదిలీలు, ప్రమోషన్లతో ఇప్పటికే లబ్ధిపొందారు. నిత్యం తమతో తిరుగుతూ, కలివిడిగా మాట్లాడుతున్నవారికి ఉన్నఫలంగా వినికిడిలోపం ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇవ్వడం ఏమిటని వైద్యులపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరికొందరు కంటి చూపు తగ్గినట్లుగా, సర్జరీలు చేయించినట్లుగా సర్టిఫికెట్లు తెచ్చుకోవడం చూసి తోటి టీచర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇవన్నీ బదిలీల్లో దగ్గరి స్థానాలు పొందేందుకు, ప్రమోషన్ల కోసమే అని నిట్టూరుస్తున్నారు. ఇలా దొడ్డిదారిలో లబ్ధి పొందేవారితో తమకు నష్టం జరుగుతోందని అర్హులు అంటున్నారు.

ఇదే నిదర్శనం..

ప్రిఫరెన్షియల్ కేటగిరీని కొందరు టీచర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు దుర్వినియోగం చేశారని డీఈఓ ప్రసాద్‌బాబుకు బాధిత టీచర్లు రామతులశమ్మ, వెంకట శ్రీనివాసులు, రమేష్ తదితరులు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతపురం కేఎస్ఆర్ బాలికల హైస్కూల్‌లో ఆరు స్కూల్ అసిస్టెంట్లు ఇంగ్లిష్ పోస్టులు ఉన్నాయని, వీటిలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద 3 మాత్రమే భర్తీ కావాల్సి ఉందని అన్నారు. కానీ డీఈఓ కార్యాలయంలో పనిచేసే కొంత మంది సిబ్బంది నిర్వాకం వల్ల జీవోకు విరుద్ధంగా ఐదు పోస్టులను ప్రిఫరెన్షియల్ కింద భర్తీ చేశారని అన్నారు. దీని వల్ల సీనియారిటీ జాబితాలో మిగిలిన టీచర్లకు చాలా నష్టం జరుగుతుందని వాపోయారు. అక్రమాలకు పాల్పడిన టీచర్ల పేర్లతో మరీ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.


డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న టీచర్లు

వెరిఫికేషన్‌కు వెళ్లని వారూ..

ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందాలనుకునే టీచర్లకు ఏప్రిల్ 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీహెచ్ సర్టిఫికెట్లు ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు, హెచ్‌ఎంలు పునఃపరీక్షలు చేయించుకుని, కొత్తగా సర్టిఫికెట్లు ఇచ్చారు. వాటినే బదిలీలు, ప్రమోషన్లతో వాడుకోవాలి. అయితే కొందరు ప్రత్యేక మెడికల్ క్యాంపులకు వెళ్లని వారు పాత సర్టిఫికెట్లు పెట్టి ప్రిఫరెన్షియల్ కేటగిరీలో లబ్ధిపొందారని సమాచారం. సదరం సర్టిఫికెట్లు, నకిలీవి చూపించి లబ్ధిపొందారన్న విమర్శలు బలంగా ఉన్నాయి.

ప్రిఫరెన్షియల్ విభాగంలో అన్ని కేటగిరీ టీచర్ల నుంచి 417 దరఖాస్తులు వచ్చాయి. ఆ వివరాలు ఇవి..

కేటగిరీ	దరఖాస్తు చేసిన టీచర్లు
స్కూల్ అసిస్టెంట్లు (తెలుగు)	41 మంది
గ్రేడ్ -2 హెచ్‌ఎంలు	6 మంది
ప్రైమరీ హెచ్‌ఎంలు	6 మంది
ఎల్పీటీలు(తెలుగు, ఉర్దూ, పీఈటీ)	10మంది
ఎస్‌ఏ(స్పెషల్ ఎడ్యుకేషన్)	ముగ్గురు
ఎస్‌ఏ- బయాలజీ	32మంది
ఎస్‌ఏ- ఇంగ్లీష్	29మంది
ఎస్‌ఏ- హిందీ	29 మంది
ఎస్‌ఏ- గణితం	32మంది
ఎస్‌ఏ- పీడీ	6 మంది
ఎస్‌ఏ - ఫిజికల్ సైన్స్	19 మంది
ఎస్‌ఏ-సోషల్	19 మంది
ఎస్‌ఏ-ఉర్దూ	ఒకరు
ఎస్‌జీటీలు	184 మంది

- 2013లో ఓ టీచర్ అక్రమంగా స్పౌజ్ పెట్టి సస్పెండ్ అయ్యారు. అదే టీచర్ తాజాగా పీహెచ్ సర్టిఫికెట్ పెట్టి ప్రమోషన్ పొందారని ఉపాధ్యాయుల్లో చర్చ నడుస్తోంది. నార్పల మండలం నుంచి మరో టీచర్ సర్జరీ చేయించుకున్నానని ప్రిఫరెన్షియల్ కేటగిరీలో పాతూరులోని ఓ స్కూల్‌కు బదిలీపై వచ్చినట్లు సమాచారం.

మద్యం షాపులకు రీ నోటిఫికేషన్

అనంతపురం అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు మద్యం షాపులకు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి శుక్రవారం రీ నోటిఫికేషన్ ఇచ్చారు. తాడిపత్రిలో 3, కళ్యాణదుర్గం, పెద్దవడుగూరులో ఒక్కొక్క దుకాణానికి దరఖాస్తులు ఆహ్వానించారు. జిల్లాలోని ఏ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లోనైనా, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 19వతేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు లు స్వీకరిస్తామని ఈఎస్ తెలిపారు. 21న జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో లాటరీ తీస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నాలుగో రోజూ కొనసాగిన కౌన్సెలింగ్

అనంతపురం విద్య, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ 4వ రోజూ కొనసాగింది. సీరియల్ నంబర్ 1001 నుంచి 1400 వరకూ టీచర్లను శుక్రవారం మధ్యాహ్నం 11 గంటల నుంచి కౌన్సెలింగ్‌కు పిలిచారు. భాషా పండితులు మధ్యాహ్నం స్టేజ్‌పై నిరసన తెలిపారు. దీంతో కౌన్సెలింగ్ కొంత సేపు వాయిదా పడింది. రాత్రి 9 గంటల సమయంలో ఓ కానిస్టేబుల్ తన భార్యకు కోరుకున్న స్థానాన్ని ఇవ్వాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇతర ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో సర్దుకున్నారు. కౌన్సెలింగ్ రాత్రి వరకూ కొనసాగింది.

ఈ-పోస్ ద్వారా ఎరువులను పంపిణీ చేయాలి

అనంతపురం అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రైతులకు ఈ-పోస్ ద్వారానే ఎరువులను పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. తన కార్యాలయంలో ఈ-పోస్ పంపిణీపై అవగాహన కల్పించారు. నిబంధనల మేరకు ఎరువులను విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే అధికంగా ఎక్కడైనా వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డీలర్లకు ఈ-పోస్ ఆధార్ బయోమెట్రిక్ మిషన్లను అందజేశారు. టెక్నికల్ ఏఓలు బాలూనాయక్, వంశీకృష్ణ, కంపెనీ ప్రతినిధులు, డీలర్లు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.34వేలు

అనంతపురంరూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.34వేలు ధర పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 399 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

హా.. ష్పన్లు..!

- ఖాళీ చూపకుండానే బదిలీ ఆప్షన్లు
- బెంబేలెత్తుతున్న స్టాఫ్ నర్సులు



అనంతపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్సుల బదిలీ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులను తప్పనిసరిగా బదిలీ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశించారు. జిల్లా సర్వజన ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ, వైద్య విధాన పరిషత్ పరిధిలోని సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా వైద్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలలో పనిచేస్తున్న నర్సులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. దీంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు ఐదేళ్లు సర్వీస్ పూర్తి అయినవారిని గుర్తించి, దరఖాస్తులు, స్థానాల ఆప్షన్లు తీసుకున్నారు. వాటిని ఉన్నతాధికారులకు పంపించారు. బదిలీల ప్రక్రియ నేపథ్యంలో కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం ఉమ్మడి జిల్లాలలో ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకుని, తప్పనిసరిగా బదిలీ కావాల్సినవారి జాబితాను ముందుగా ప్రకటించాలి. ఆ తర్వాత జాబితాలోని నర్సుల నుంచి ఆప్షన్లు తీసుకోవాలి. కానీ ఖాళీలు తెలియపరచకనే ఆప్షన్‌లు కోరడంతో దిక్కుతోచక ఏదో ఒక ఉమ్మడి జిల్లా పేరు రాసి పంపారు. అధికారికంగా ఇప్పటికీ క్లియర్ వేకెన్సీలను ప్రకటించలేదు. సర్వీస్ సీనియారిటీ ఆధారంగా ఆప్షన్ పెట్టుకున్న స్థానాలను ఆన్‌లైన్‌లోనే కేటాయిస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం కలిపి ఒకే ఖాళీ ఉన్నట్లు చూపించారు. ఉమ్మడి అనంతపురం జిల్లావారు ఎక్కువగా కర్నూలు జిల్లానే ఆప్షన్‌గా ఇచ్చారు. దీంతో ఒక్కరు పోనూ మిగిలిన వారి పరిస్థితి ఏమిటన్నది తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇలా చేస్తే మకు అన్యాయం జరుగుతుందని, క్లియర్ వేకెన్సీ చూపిన తరువాత ఆప్షన్‌లు తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్షురాలు పద్మావతి, ప్రధన కార్యదర్శి లత డిమాండ్ చేశారు.

అప్పర్ పెన్నార్ పనులను ప్రారంభించండి

- జలవనరుల శాఖ మంత్రికి ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి

అనంతపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అప్పర్ పెన్నార్ ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు అందించే పనులను ప్రారంభించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మంత్రితో సమావేశమయ్యారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో ప్రధానంగా అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు డ్యాం) పనులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ మొదలు పెట్టాలని, గతంలో భూములిచ్చిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరారు. హంద్రీనీవా కాలువ పరిధిలో 1.10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్న ప్రభుత్వం నిర్ణయం మేరకు డిస్ట్రిబ్యూటరీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకోసం రూ.17 కోట్లతో తయారు చేసిన అంచనాలకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. పండమేరు వాగుపై రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.90 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. గతేడాది భారీ వర్షాలకు తెగిపోయిన కనగానపల్లి సాగునీటి చెరువు మరమ్మతుకు నిధులు ఇవ్వాలని కోరారు. నడిమివంకకు రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు గురించి చర్చించారు. అన్ని అంశాలపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే ఈ అంశాలు తన దృష్టికి వచ్చాయని, వెంటనే అధికారులకు ఆదేశాలిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూడా చర్చించి పేరూరు ప్రాజెక్టు నీరందించే పనులు చేపడగామని హామీ ఇచ్చారని అన్నారు.


మంత్రి రామానాయుడితోభేటీ అయిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, నెల్లూరు జట్ల విజయం


శతకం బాదిన అభిషేక్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సీనియర్ సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో అనంతపురం, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ క్రికెట్ టోర్నమెంట్ మూడో రోజు శుక్రవారం స్థానిక అనంతపురం క్రికెట్ స్టేడియం(ఆర్డీటీ)లో కొనసాగాయి. మొదటి మ్యాచ్‌లో నెల్లూరు, కడప జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన కడప 36ఓవర్లలో 9వికెట్లు 221పరుగులు చేసింది. బ్యాటర్లు ధనుష్ 40, జయవర్ధన్ 35, వంశీకృష్ణ 31 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 34.5 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఇందులో బ్యాటర్ రేవంత్ రెడ్డి 102 పరుగులు, అకినాష్‌రెడ్డి 41 పరుగులు, ఫర్హాద్‌ఖాద్రి 49 పరుగులు చేశారు. మరో మ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య జరగగా...మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 185పరుగులు చేసింది. ఇందులో అభిషేక్ రెడ్డి 102 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసి విజయం సాధించింది. బ్యాటర్లు రోహిత్‌రోషన్ 37 పరుగులు, గిరినాథ్ రెడ్డి 44, రాజు కుళ్లాయప్ప 48 పరుగులు చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి బీమలింగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి రైల్వే డీజిల్ షెడ్ తనిఖీ


డీజిల్ షెడ్‌లో పలు విభాగాలను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్

గుత్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే ఎలక్ట్రికల్ డీజిల్ షెడ్‌ను శుక్రవారం సికింద్రబాదుకు చెందిన ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బ్రిడ్జ్ మోహన్ మీనా ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీజిల్ షెడ్‌లోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సిమ్యులేటర్ టెస్ట్‌ను ప్రారంబించారు. డీజిల్ షెడ్‌లో మొక్కలు నాటారు. సిమ్యులేటర్ టెస్ట్‌కు, ఎయిర్ బ్రేక్ సెక్షన్‌కు రూ. 10వేలు క్యాష్ అవార్డును ఇచ్చారు. షెడ్‌కు రూ. 25వేలు క్యాష్ అవార్డును ప్రకటించారు. ఈసీఎం సెక్షన్ రూ. 10వేలు క్యాష్ అవార్డు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఏడీఎంఈ అశోక్‌గౌడ, నాయకులు చంద్ర, సుంకన్న, మెకానికల్ సెక్షన్ ఇంజనీర్ మనోజ్, ఎలక్ట్రికల్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గోవిందరాజులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్ల పంపిణీలో పాల్గొన్న ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను వైస్ సర్పంచ్ ఆలం నరసానాయుడు శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి రాజకీయ చిహ్నాలు, రంగులు, నాయకుల ఫొటోలు కనిపించకుండా ప్రభుత్వం ఈ కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలనుకోవడం సంతోషకరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మహోన్నత వ్యక్తుల పేర్లు మీద పథకాలను తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ డీడీ బాధ్యతల స్వీకరణ



డీడీ ఉమాదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

అనంతపురం అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ డీడీగా ఉమాదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తున్న ఆమె ఇక్కడికి ఉద్యాన శాఖ డీడీగా బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో నగరంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన డీడీకి ఆ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉమాదేవి మాట్లాడుతూ... జిల్లా ఉద్యాన రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

ఉద్యాన ఏడీగా దేవానంద్..

ఉద్యాన శాఖ ఏడీగా దేవానంద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీగా పనిచేసిన నరసింహారావును నెల్లూరు మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లా భీమవరంలో పనిచేస్తున్న ఏడీ దేవానంద్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. నూతన ఏడీకి పలువురు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఏఓగా వెంకటకుమార్..



ఏఓకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న సిబ్బంది

అనంతపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ అధికారిగా వెంకట కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో టెక్నికల్ విభాగంలో ఏఓగా పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శశికళ అనంతపురం వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలోని టెక్నికల్ ఏఓగా బదిలీ అయ్యారు. నూతన ఏఓకు ఏఈఓలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రవికుమార్ ..

రామగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా డీఎస్ఓ కార్యాలయంలో నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ జమానుల్లాఖాన్ కదిరికి బదిలీ అయ్యారు. అయితే ఇంకా రిలీవ్ కాలేదు. రిలీవ్ అయిన వెంటనే అదనపు బాధ్యతలను రవికుమార్‌కు ఇవ్వనున్నట్టు తెలిసింది.

ఉద్యాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

శింగనమల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం కేంద్రం శింగనమలలో ఉద్యాన శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా చాలా మంది రైతులు ఉద్యానవన పంటలైన అరటి, చీనీ,సపోటా, నిమ్మ, చింత డ్రాగన్‌ఫ్రూట్, అంజూర, బంతి, చామంతి తదితరాలు సాగు చేస్తున్నారన్నారు. స్థానికంగా ఉద్యాన శాఖ కార్యాలయం లేకపోవడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారన్నారు. కనుక ఆ రైతులకు అనుగుణంగా నియోజకవర్గం కేంద్రంలో ఆ శాఖ కార్యాలయాన్ని అధికారులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధుయాదవ్, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, రామాంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిరుద్యోగులకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువ కులకు ఉపాధి అవకాశాల కోసం కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బేసిక్ కంప్యూటర్స్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సుల్లో స్థానిక ఎకాలజీ సెంటర్లోనే వారం రోజుల్లో శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఇంటర్, డిప్లొమా, ఇంజనీరింగ్ చదివి 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. 45రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ఐటీ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 7396950345ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంటి గుత్తల కోసం సర్వే

అనంతపురం కల్చరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని నవయుగ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్మించిన ఇళ్లకు సంబంధించి గుత్తల కోసం శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సందీప్ హాజరై కాలనీలో నివాస గృహాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి అల్లీపీర, నవయుగ కాలనీ కార్యదర్శి జీ.రాజు, స్థానిక కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు తాడిపత్రికి పెద్దారెడ్డి



జేసీ ఇంటి వద్ద గుమికూడిన టీడీపీ అభిమానులు

తాడిపతి జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం తాడిపత్రికి వస్తున్నాడని సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో అల్లర్లు సృష్టించడానికే పెద్దారెడ్డి వస్తున్నారని, ఆయన పర్యటనను అడ్డుకుంటామని వారు స్పష్టం చేశారు. దీంతో జేసీ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది.

తల్లికి వందనం అమలుపై సంబరాలు

● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన తెలుగు తమ్ముళ్లు



ఇటుకలపల్లిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు



ఆత్మకూరులో..



గార్లదిన్నె మండలం కల్లూరులో ..

గార్లదిన్నె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): చదువుతున్న పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడం పట్ల తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేశారు. మండలంలోని కల్లూరు గ్రామంలో గల నీలం సంజీవ రెడ్డి సర్కిల్లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సామాల రాజన్న, రామకృష్ణ, సామాల మధు, రామాంజి, రామాంజాచారి, ఎల్ఐసీ ఆదినారాయణ, రమణయ్య, ఎర్రిస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్: మండలంలోని ఇటుకలపల్లిలో టీడీపీ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలువురు మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకం అమలు చేయడాన్ని హర్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరిట ఒకరికి మాత్రమే డబ్బులు వేశారన్నారు. ఇప్పుడు ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అంతమందికీ తల్లికివందనం కింద నగదు తల్లుల ఖాతాలో జమ చేశారని తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●ఆత్మకూరు : మండలకేంద్రంలో సీఎం చంద్రబాబు చిత్ర పటానికి టీడీపీ మండల నాయకులు పాలాభిషేకం చేశారు. పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా తల్లికివందనంను అమలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి ఎమ్మెల్యే పరామర్శ

అనంతపురం అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలో విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ గాయపడి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికుడు సుంకన్నను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శుక్రవారం పరామర్శించారు. అండగా ఉంటానని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. కార్మికుడికి మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఐ జగదీష్



ఎమ్మెల్యేను కలిసిన సీఐ

అనంతపురం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ జగదీష్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను స్థానిక నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడవద్దని ఎమ్మెల్యే సీఐకి సూచించారు. పూర్తి స్వేచ్ఛగా పని చేయాలని, నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని తెలిపారు.

తల్లికి వందనంతో పేదలకు ఆనందం

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు



బుక్కరాయసముద్రం, జూన్13(ఆన్‌లైన్): తల్లికి వందనం పథకం అమలు రాష్ట్రంలోనే ఓ చారిత్రకమని ... ఈ పథకంతో పేదల ఇంట ఎంతో ఆనందం నెలకొందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అంత మందికీ ప్రభుత్వం ఒక్కొక్కరి రూ.13 వేలు చొప్పున వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం చారిత్రాత్మకమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఒక విద్యార్థికే అమ్మ ఒడి ఇచ్చిందన్నారు. సూపర్‌సిక్స్‌పై అవాకులు చవాకులు పేలే వారికి తల్లికివందనం అమలు గొప్ప గుణపాఠమని పేర్కొన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ అమలవుతుందని ఆయన చెప్పారు.

'తల్లికి వందనం' అర్హులందరికీ అందాలి

తాడిపత్రి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ 'తల్లికి వందనం' అందేలా చూడాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలోని 3,175 మందికి వివిధ రకాల పెండింగ్ చూపుతోందని, వాటిని సరి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, ఎంఈఓ నాగరాజు, రామగోవిందురెడ్డి పాల్గొన్నారు.

ఎవరి భూములూ ఆక్రమించలేదు

విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి



అనంతపురంరూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో తాను ఎవరి భూములను ఆక్రమించలేదని, సక్రమమైన భూములనే కొనుగోలు చేశానని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. నగర శివారులో గల పీవీకేకే కళాశాలలోని నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన జిల్లాలో అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాలలు స్థాపించాలనే లక్ష్యంతో రూరల్ మండలంలోని ఆలమూరు వద్ద కేఎం షఫీవుల్లా, మాజీ ఎంపీ సైపుల్లా వాళ్లకు అన్ని హక్కులు కలిగిన 204 ఎకరాల భూమిని శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా తాను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. పేదల కడుపు కొట్టి ఎవరి భూములు తీసుకోవాల్సిన అవసరం ఆ కుటుంబానికి గానీ, తనకు కానీ లేదన్నారు. అప్పటి కలెక్టర్ కోన శశిధర్, ఆర్డీఓ మధుసూదన్, ఇతర రెవెన్యూ అధికారులను సంప్రదించి ప్రభుత్వ రికార్డులు పరిశీలించిన తరువాతనే కొనుగోలు చేశామన్నారు. ఈ భూముల్లో ఇతరులకు సంబంధం లేదన్నారు. అయితే ఆలమూరుకు చెందిన ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు గత గురువారం ప్రెస్‌క్లబ్‌లో మా భూములు ఆక్రమించారని తనపై ఆరోపణలు చేశారన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కొంతమంది వెనక ఉండి కుల సంఘాలను అడ్డంపెట్టుకుని అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. సివిల్ యాక్ట్ ప్రకారం వారిపై అన్ని విధాలుగా ముందుకు వెళ్తామని పల్లె పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

శింగనమల, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సలకం చెరువుకు చెందిన టీడీపీ నాయకుడు ఈడిగ శ్రీనివాసులు(48) అలియాస్ దుబ్బ శీనా శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన పరిస్థితి విషయమించడంతో ఇంటి వద్దనే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలియగానే మండలంలోని టీడీపీ నాయకులు గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడికి భార్య కూమారుడు, కుమార్తె ఉన్నారు.

జూదరుల అరెస్టు

అనంతపురం క్రైం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగరంలో జూదమాడుతున్న ఏడుగురుని నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. శ్రీనగర్ కాలనీలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సీఐ జగదీష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అందులో ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3,56,090ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న వెంకటేష్

అనంతపురం క్రైం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన కురుబ వెంకటేష్ (58) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే ఒకరి నమ్మి రూ.12లక్షలకు మధ్యవర్తిగా ఉండి వ్యవహరించాడు. ఆ డబ్బు తిరిగి రాకపోవడంతో ఇలా ఎలా చేస్తావంటూ కుటుంబసభ్యులు నిలదీశారు. ఇదే విషయంపై శుక్రవారం భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన అతను గ్రామ సమీపంలో ఓ వెంచర్ వద్ద చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు విషయంలో సుప్రీం కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి శుక్రవారం ప్రకటనలో అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా సుప్రీం కోర్టు వ్యాఖ్యలున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని సూచించారు.

దామాజిపల్లిలో చోరీ

●8తులాల బంగారు నగలు, కొంత నగదు అపహరణ



బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లి గ్రామంలో ఓ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రాఘవేంద్ర భార్య తిరుపతికి వెళ్లింది. ఆయన గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి మిద్దెపై నిద్రించాడు. ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా కూడా తెరిచిఉంది. ఇనుపరాడ్డుతో బీరువా తలుపులను ధ్వంసం చేసి అందులో ఉన్న 8తులాల బంగారు నగలు, కొంత నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని గుర్తించారు. వెంటనే విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించిన తరువాత చుట్టుపక్కల విచారించారు. అదేవిధంగా డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

● పొలంలో చేతికందేఎత్తులో వేలాడుతున్న వైనం
● భయాందోళనలో రైతులు
● నెలలు గడుస్తున్నా పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు ప్రసాద్

రాప్తాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో ఉన్న ఓ పొలంలో 11 కేవీ విద్యుత్ తీగలు మృత్యు తీగలుగా మారాయి. చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయి. ఎవరైనా అక్కడ ఏమరుపాటుగా వ్యవహరిస్తే అంతే సంగతులు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ పొలం రైతు ఆందోళన చెందుతున్నాడు. హంపాపురానికి చెందిన జానగొండ ఆంజనేయులు కుమారుడు ప్రసాద్‌కు కందుకూరు రోడ్డు పక్కన 5 ఎకరాల పొలం ఉంది. ఆయన పక్కనే ఉన్న మరో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని వేరుశనగ, చీనీ పంటలు సాగు చేశాడు. అయితే 5 నెలల క్రితం భారీ గాలీ వానకు అక్కడి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగింది. కాలక్రమేణా 11 కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడసాగాయి. ప్రస్తుతం చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఇటీవల పొలం వద్దకు మేతకు వచ్చిన రెండు గొర్రెలు ప్రమాదవశాత్తు ఆ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని నిత్యం పొలం వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని ఆ రైతు వాపోతున్నాడు.

ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు..

మా పొలంలో 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, సమస్య పరిష్కరించాలని పలు మార్లు విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని రైతు జానగొండ ప్రసాద్ వాపోతున్నారు. పొలంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనగా ఉందంటున్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని కోరుతున్నారు.

ఈ విషయంపై రాప్తాడు మండల విద్యుత్ శాఖ ఏఈ శివప్రసాద్‌ను వివరణ కోరగా.. వెంటనే ఆ రైతు పొలంలో ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను సరి చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

● పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి
● 16న కలెక్టరేట్ ఎదుట ధర్నా
● అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

అనంతపురం కల్చరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ వేతనాలతో, ఎక్కువ పనిభారంతో జీవనాలు సాగిస్తున్న అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. రూ.12వేలు వేతనం వచ్చేవారికి పథకం వర్తించదని అధికారులు చెబుతున్నారని, అంగన్వాడీలకు రూ.11,500లు, మినీ వర్కర్లకు, హెల్పర్లకు రూ.7వేలు ప్రకారం గౌరవ వేతనం ఇస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తించకపోవడం సమంజసం కాదన్నారు. రేషన్ కార్డులు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, గృహనిర్మాణ స్థలాలు ఇవ్వాలని అన్నారు. అంగన్వాడీలకు ఫోన్లు ఇచ్చి ఆన్‌లైన్ పనులు చేయాలని ఒత్తిడి తేవడంవల్ల వారు మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేస్ రికగ్నిజేషన్ తొలగించి, ఆన్‌లైన్ పని చేయడానికి మంచి ర్యామ్‌తో కూడిన ట్యాబ్‌లను అంగన్వాడీ కేంద్రాలకు అందించాలన్నారు. సెంటర్లకు రావాల్సిన సరుకులు నేరుగా సెంటర్లకే సరఫరా చేయాలని కోరారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 16న కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాలో అంగన్వాడీలందరూ పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కోశాధికారి కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే చర్యలు తీసుకోండి

● వైద్యాధికారులకు ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశం

అనంతపురంటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశువులకు లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యానేరమని, ఎవరైనా అలాంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఆర్డీఓ కేశవనాయుడు ఆదేశించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం లింగర్ధారణ నిషేధిత చట్టంపై సమీక్ష జరిగింది. ఇందులో ఆర్డీఓ పాల్గొని మాట్లాడుతూ.. లింగనిర్ధారణ చేస్తున్న వారిపై ప్రత్యేక నిఘాఉంచాలన్నారు. అలాంటి స్కానింగ్‌సెంటర్లు, ఆస్పత్రులపై డెకాయ్ ఆపరేషన్స్ చేపట్టి సాక్ష్యాలతో పట్టుకుని చట్టపరంగా శిక్షించాలన్నారు. అబార్షన్లు చేసేవారిని, డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు ఇచ్చేవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా లింగనిర్ధారణ నిషేధిత చట్టంపై ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించి.. చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఇతరశాఖలను సమన్వయం చేసుకుని లింగనిర్ధారణ జరగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో వైద్యులు పార్వతి,శంకరనాయక్, శ్రావణి, దుర్గేష్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, హనుమన్న, డెమోలు త్యాగరాజు, గంగాధర్ ,సీఐ శాంతిలాల్, ఎస్టీఓ అనిత, ఐసీడీఎస్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయాలి: డీఎంహెచ్‌ఓ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి సూచించారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో యోగాపై సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ పాల్గొని మాట్లాడారు. యోగాసనాలు, మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఆస్పత్రులు, ఔషధాలకు దూరంగా ఉండాలంటే యోగాను నిత్యజీవితంలో అలవాటుగా మార్చుకోవాలని తెలిపారు. అనంతరం యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపోమేనేజర్ నాగభూపాల్, ఆయుష్ వైద్యులు రామ్‌కుమార్, లాల్యానాయక్, డెమో త్యాగరాజ్, యోగా గురువులు కృష్ణవేణి, గురు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదలచేస్తున్న నాగప్రసాద్ నాయుడు

అనంతపురం సెంట్రల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మసీ పరీక్షల ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు శుక్రవారం విడుదల చేశారు. ఏప్రిల్, మే నెలల్లో బి.ఫార్మసీ ప్రథమ సంవత్సరం ఒకటో సెమిస్టర్(ఆర్23) రెగ్యులర్, సప్లిమెంటరీ (ఆర్15, 19)పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం జేఎన్టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ శివప్రసాద్, ఏసీఈలు శ్రీధర్, అంకారావు పాలల్గొన్నారు.

కల్లుగీత కార్మికులను సొసైటీలోకి చేర్చుకోవాలి

● ఈడిగ సంఘం రాయలసీమ ప్రతినిధి వేణుగోపాల్ గౌడ్ డిమాండ్
● కల్లుగీత కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన

అనంతపురం అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎక్సైజ్ పోలీసులు 15 మందిని కల్లుగీత కార్మికులుగా గుర్తించినా.. అనంతపురం టీసీఎస్ సొసైటీలోకి ఎందుకు తీసుకోరని ఈడిగ సంఘం రాయలసీమ ప్రతినిధి వేణుగోపాల్ గౌడ్ నిలదీశారు. ఈ మేరకు శుక్రవారం పలువురు కల్లుగీత కార్మికులతో కలిసి స్థానిక కలెక్టరేట్ ఎదుట కల్లు సరఫరా చేసే వాహనాన్ని అడ్డగించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనంతపురం ఎక్సైజ్ పోలీసులు 15 మందికి టైపింగ్ టెస్ట్ నిర్వహించి, కల్లుగీత కా ర్మికులుగా గుర్తించారన్నారు. వీరిని సొసైటీకి చేర్చుకోవాలని సొసైటీ అధ్యక్షుడు రఘురామయ్యకు లేఖ కూడా పంపారన్నారు. అయితే సొసైటీ అధ్యక్షుడు, బోర్డు డైరెక్టర్లు ఏ ఒక్క కొత్త కార్మికుడిని సొసైటీలోకి తీసుకుండా అడ్డుపడుతున్నారన్నారు. గత 25 సంవత్సరాలుగా ఒకే పాలక మండలిలో 15 సంవత్సరాలపాటు అధ్యక్షుడిగా రఘురామయ్య కొనసాగుతున్నారన్నారు. కలెక్టర్, ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి, కల్లుగీత కార్మికులను సొసైటీలో చేర్చుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు మరింతగా ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మికులు ప్రసాద్, నారాయణస్వామి, శివకుమార్, రాము, రాజేంద్ర, రామాంజినేయులు, వెంకటేష్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వేణుగోపాల్ గౌడ్, కల్లుగీత కార్మికులు

న్యూస్ బాక్స్

అందుబాటులో ఉండని వైద్యులు

బొమ్మనహాళ్, జూన్, 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండటం లేదని, విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని మార్కెట్‌యార్డు మాజీ డైరక్టర్ మహేంద్ర ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండాలని, అయితే వైద్యులు క్యాంపుల పేరుతో విధులకు డుమ్మా కొడుతు న్నారని అన్నారు. రిజిస్టర్‌లో సంతకాలు చేసి.. వెళ్లిపోతున్నారన్నారు.

అటెండర్ మృతి

యల్లనూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పశు వైద్యశాలలో అటెండర్ అనిల్ (32) శుక్రవారం మరణించాడు. గురువారం డ్యూటీలో ఉండగా అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు 108లో పులివెందులకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మరణించాడు. అనిల్‌కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. .

'తల్లికి వందనం' అర్హులందరికీ అందాలి

తాడిపత్రి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ 'తల్లికి వందనం' అందేలా చూడాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలోని 3,175 మందికి వివిధ రకాల పెండింగ్ చూపుతోందని, వాటిని సరి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, ఎంఈఓ నాగరాజు, రామగోవిందురెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అగ్రికల్చర్ కళాశాల వార్షికోత్సవం

పెద్దపప్పూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు సమీపాన జేసీ దివాకర్‌రెడ్డి వ్యవసాయ కళాక్షేత్రం కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహానంది అగ్రికల్చర్ కళాశాల డీన్ విజయలక్ష్మి, రేకలకుంట వ్యవసాయ కళాక్షేత్రం ఏఆర్ఎస్‌డీఆర్ విజయశంకర్ బాబు, అగ్రికల్చర్ కళాశాల కరస్పాండెంట్ జానకినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

కుందుర్పి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరిగానపల్లి ఎస్సీ కాలనీలో రూ. 40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఇందులో గ్రామ సర్పంచ్ నాగేంద్ర, మాజీ సర్పంచ్‌లు చిత్రలింగప్ప, రాఘవేంద్ర బాబు, గ్రామ కన్వీనర్ తిప్పేస్వామి, టీడీపీ నాయకులు, మోహన్, మారుతి, రామాంజినేయులు, కొల్లప్ప, ధనుంజయ, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం మండల వాసి ఆత్మహత్య

దొరవారిసత్రం (తిరుపతి జిల్లా), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లెకు చెందిన అంజప్పగారి ఈశ్వరప్ప (45) తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం తనియాలిలో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను డీఎస్సీ పరీక్షలు రాయడానికి రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లాడు. గురువారం తనియాలి వద్ద పొలాల్లో గొర్రెల కాపరులతో మాట్లాడాడు. తాను అలిగి ఇంటి నుంచి వచ్చేసినట్లు చెప్పాడు. గొర్రెల కాపరుల వద్ద భోజనం చేసిన ఈశ్వరప్ప.. శుక్రవారం రాత్రి కాళంగి నది ఒడ్డున ఉన్న చెత్త నుంచి సంపద తయారీ షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈశ్వరప్పకు భార్య శ్రీలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైతులకు సర్వర్ కష్టాలు



ఈకేవైసీ కోసం ఎదురుచూస్తున్న రైతులు

యాడికి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం లబ్ధికి రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి. దీంతో శుక్రవారం రైతు సేవా కేంద్రాలకు ఉదయం రైతులు తరలివచ్చారు. మధ్యాహ్నం వరకు సర్వర్ పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. విత్తు సాగు పనులు వదులుకొని రావాల్సి వస్తోందని పలువురు రైతులు వాపోయారు.
● బెళుగుప్ప : అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ సూచించారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రైతులు వేలిముద్ర వేయాలన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

కూడేరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తమ గ్రామం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంఎంహళ్లి టీడీపీ నాయకులు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో విజ్ఞప్తి చేశారు. తమ గ్రామం నుంచి మండల కేంద్రానికి సరైన రోడ్డు లేదని, గ్రామంలో సీసీ రోడ్లు వేయించాలని కోరారు. మంత్రిని కలిసి వారిలో డీలర్ పూజారి రాజప్ప, వన్నూరస్వామి, అక్కులప్ప, శీను, పూజారి అక్కులప్ప, ఎర్రిస్వామి, ప్రవీణ్, అడ్వకేట్ వెంకటేష్ ఉన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

గుంతకల్లు టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దారు రమాదేవితో పాటు పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆమ్లెట్‌మస్తాన్ యాదవ్, సంఘ సేవకుడు మేస్రీ దొడ్డప్ప, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆజేంద్రరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

కూడేరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పి. నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన చిన్నారులకు సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ సీడీపీఓ యల్లమ్మ, సూపర్‌వైజర్ అరుణ, రామ్మోహన్, అంగన్‌వాడీ వర్కర్లు లక్ష్మీకాంతమ్మ, రాజమ్మ, కామాక్షి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

ప్రతి ఇంటికీ తాగునీరు : విప్

రాయదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అమృత్-2 పథకం కింద ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. పట్టణంలోని పైతోటకు తాగునీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటుకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ పథకం కింద మొలకాల్మూరు చెక్‌పోస్ట్ సమీపంలో తాగునీటి నిల్వ కోసం ప్రత్యేక ట్యాంక్ నిర్మిస్తామన్నారు. దాంతో పైతోటకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ



పెద్దపప్పూరులో విద్యాకిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపప్పూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మండలంలోని జూటూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు.
● తాడిపత్రి : పట్టణంలోని కాల్వగడ్డవీధి, కెవిరెడ్డినగర్‌లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. సమస్యలపై ఆరా తీశారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి తల్లికి వందనం



ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లి అపర్ణ

కళ్యాణదుర్గం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసంపల్లిలో దళిత కుటుంబానికి చెందిన అపర్ణ, సురేష్ కూలీలు. వీరికి ముగ్గురు పిల్లలు. అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మోక్షిత ఐదో తరగతి, ప్రశాంతి మూడో తరగతి, వరుణ్‌తేజ్ రెండో తరగతి చదువుతున్నారు. ఒకేసారి ఈ ముగ్గురి పిల్లలకు తల్లికి వందనం కింద రూ. 39 వేలు శుక్రవారం జమ కావడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

నేడు తాడిపత్రికి పెద్దారెడ్డి



జేసీ ఇంటి వద్ద గుమికూడిన టీడీపీ అభిమానులు

తాడిపతి జూన్ 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం తాడిపత్రికి వస్తున్నాడని సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో అల్లర్లు సృష్టించడానికే పెద్దారెడ్డి వస్తున్నారని, ఆయన పర్యటనను అడ్డుకుంటామని వారు స్పష్టం చేశారు. దీంతో జేసీ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది.

క్రైం న్యూస్ ..

పాము కాటుతో వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)

రాయదుర్గం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎన్ హళ్లి గ్రామానికి చెందిన కుమ్మరి అశోక్ (33) పాము కాటుతో మరణించాడు. ఇతను కూలీ. శుక్రవారం తోటలో పని చేస్తుండగా పాముకాటు వేసింది. అతన్ని వెంటనే రాయదుర్గం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురం ఆసుపత్రికి తీసుకెళుతుండగా మరణించాడు. అశోక్‌కు భార్య లక్ష్మి, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

కుక్కలదాడిలో 36 గొర్రెలు ..

పుట్లూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివారులో గొర్రెల మందపై శుక్రవారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేయడంతో 36గొర్రెలు మరణించాయి. దీంతో తనకు రూ. రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని బాధితుడు పుట్లూరుకు చెందిన తలారి శ్రీనివాసులు విజ్ఞప్తి చేస్తున్నాడు. గొర్రెల కళేబరాలను ఎంపీడీఓ అలివేలమ్మ, సిబ్బందితో కలిసి పరిశీలించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పుట్లూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా దుబల్‌గుడి గ్రామానికి చెందిన భార్యభర్తలు సంగీత, నాగరాజు మండలంలోని ఏ. కొండాపురంలో ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవారు. సంగీతపై అనుమానంతో 2024 అక్టోబరు 15న నాగరాజు గొంతు నులిమి హత్య చేసి పారిపోయాడు. శుక్రవారం అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు.

హిజ్రాలపై కేసు

గుంతకల్లుటౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో హిజ్రాలు లాస్య, అపర్ణ గ్రూపులు ఉన్నాయి. తిలక్‌నగర్‌లో నివాసముంటున్న లాస్య, మరో ముగ్గురిపై గురువారం రాత్రి అపర్ణ, నాసిర్, శివతో పాటు మరికొందరు దాడి చేశారు. దీనిపై లాస్య శుక్రవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అపర్ణ, శివ, నాసిర్‌తో పాటు మరో కొందరిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని సీఐ ఏపీ మస్తాన్ తెలిపారు.

టీడీపీ నాయకుడి పంట ధ్వంసం

కళ్యాణదుర్గం , జూన్ 13(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం వైసీపల్లికి చెందిన టీడీపీ నాయకుడు మంజునాథ చౌదరి తన పొలంలో సాగు చేసిన ఉలవ పంటను అదే గ్రామానికి చెందిన కురుబ రామాంజినేయులు, మరో 20 మంది ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. దీనిపై మంజునాథ చౌదరి శుక్రవారం కంబదూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెబ్‌ల్యాండ్‌లో భూమి తమ పేరు మీద ఉన్నా.. కొంతమంది వచ్చి ఇలా దౌర్జన్యం చేశారని, తనకు రూ. 20 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నీటి సమస్య పరిష్కారం

కూడేరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదిరిపికొండలో అనేక సంవత్సరాలుగా ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను వారు ఇటీవల పయ్యావుల సోదరుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఆ గ్రామంలో బోరు వేయడంతో నీరు పుష్కలంగా నీరు పడ్డాయి. ఇందులో టీడీపీ నాయకులు పోల మహేష్, పాలవెంకటేష్, ధనుంజయ్య, విరుపాక్షి, వీరభద్ర, మహబూబ్‌బాషా, రాము, బంబంస్వామి, రమేష్ పాల్గొన్నారు.

యర్రిస్వామికి ప్రత్యేక పూజలు



బెళుగుప్ప, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో యర్రితాత ఆరాధనోత్సవాలు శుక్రవారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా యర్రితాతకు అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేకాలంకరణ నిర్వహించారు. యర్రితాతకు పల్లకిసేవ చేపట్టారు.